నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

శుక్రవారం | డిసెంబర్ 13, 2024 | www.navatelangana.com

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

నవతెలంగాణ-తాండూర్



వంటలో తాజా కూరగాయలను వాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని బెల్లంపల్లి తహసీల్దార్ జోష్న సూచించారు. గురువారం బెల్లంపల్లి ఎస్సీ బాలికల వసతీ గృహాన్ని సందర్శించి వసతులను పర్యవేక్షించారు. వంటలో వాడే సరుకులను కూరగాయలను పరిశీలించారు. హాస్టల్లోని వసతి సౌకర్యాలు భోజన నాణ్యతను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని తెలిపారు. అనారోగ్య సమస్యలు తలెత్తిన విద్యార్థులకు అందించే మాత్రల గడుపు తేదీని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. వంటశాల వంట పాత్రలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. మూత్రశాలలు మరుగుదొడ్లు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాజా కూరగాయలు నాణ్యమైన సరుకులు వాడి మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు.

మంచిర్యాలలో వందేభారత్ రైలు నిలపాలి

నవతెలంగాణ-జైపూర్



వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైల్ మంచిర్యాల స్టేషన్‌లో నిలుపాలంటూ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి రైల్వే స్టేషన్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ విషయమై రైల్వేశాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. నిధుల కెటాయింపుతో పాటు రైళ్ల నిలుపుదల విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కేంద్రం నుంచి శాఖ పరంగా సహకరిస్తే రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుబాటులోకి రావడంతో పాటు అభివృద్ధికి తోడ్పాటు అందుతుందని తెలిపారు.

డోర్లి, పూనగూడ గ్రామాల శివారులో పులి సంచారం



సీసీ కెమెరాలకు చిక్కిన చిరుతపులి (ఫైల్)

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని డోర్లీ, పూనగూడ గ్రామాల పరిసర ప్రాంతాలలో గురువారం సాయంత్రం పూనగూడ గుట్ట వైపు నుండి డోర్లీ గ్రామ వైపు వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. డోర్లీ గ్రామ రైతులు పనులు ముగించుకొని ఇంటి వస్తున్న క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా గ్రామస్తులు కనిపించినట్లు తెలిపారు. బిక్కుబిక్కుమంటూ చేను నుండి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. అటవీ శాఖ అధికారులు వెంటనే చుట్టుపక్క గ్రామాల ప్రజలకు సమాచారం అందించి ప్రాణహాని జరగకుండా చూడాలని కోరారు. గతంలో కూడా కప్పర్‌దేవి, కుచులాపూర్, పల్సి(కే) గ్రామా అటవీ ప్రాంతాలలో సంచరించింది. కుచులాపూర్ గ్రామానికి చెందిన రైతు ఎద్దులను చంపివేయగా అటవీశాఖ అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పులి ఆనవాళ్లను కనుగొన్నారు. పులి సంచారంపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

సీఎం కప్‌పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం ఎంపీడీఓ బి.రమేష్, మున్సిపల్ కమిషనర్ ఎస్.అంజయ్య, తహసీల్దార్ టీ కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ పోటీలకు 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం వారంకి వాలీబాల్, ఖోఖో, కబడ్డీలో పోటీలు జరిగాయి. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారికి ఈనెల 16న ఆసిఫాబాద్‌లో నిర్వహించే జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, ఆరెగూడ కాంప్లెక్స్ హెచ్‌ఎం వర్మ చంద్రశేఖర్, మామిడాల తిరుపతయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకటేష్, జడ్పీహెచ్ఎస్ చింతగూడ పీడీ నరేందర్ పాల్గొన్నారు.

మెడిటేషన్‌తో ఉత్తమ ఫలితాలు



నవతెలంగాణ-కౌటాల

మెడిటేషన్ ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలకిషన్ రావ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు కమీషనర్ ఆదేశాలు మేరకు గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ టెలిమానస్ ద్వారా విద్యార్థుల రుగ్మతలను తొలగించి ఏకాగ్రత కోసం తెలియజేయడం జరిగిందన్నారు. విద్యార్థులు ప్రతిరోజు మెడిటేషన్ చేస్తే ఏకాగ్రత వచ్చి చదువులో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఎంతగానో తోడ్పడతాయన్నారు. 90 రోజుల ప్రణాళికను తయారు చేసుకున్నామని ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తామని, ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఎల్లవేళలా కృషి చేస్తామని తల్లిదండ్రులు మాకు సహకరించాలన్నారు. విద్యార్థుల మానసిక రుగ్మతలను చెడు ఆలోచనలను తొలగించడానికి టెలిమానస్ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అశోక్, రాజం, శ్రీనివాస్ నాయక్, రంజీత్, రవిందర్, రాంబాబు, రాందాస్, భాగ్యలక్ష్మి, రాణి, సుజాతా, పాపయ్య పాల్గొన్నారు.

ఆహార భద్రత మిషన్ ఎగ్జిక్యూటివ్‌తో కలెక్టర్ సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జాతీయ ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా గురువారం జిల్లా ఆహార భద్రత మిషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం కలెక్టర్ రాజర్షిషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాకు జాతీయ ఆహార భద్రత మిషన్‌లో జిల్లాకు కేటాయించిన భౌతిక, ఆర్థిక లక్ష్యాలను జిల్లా కమిటీలో చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులకి విలువ ఆధారిత మిల్లెట్స్ స్టార్ట్ అప్‌లో భాగంగా భాగస్వాములను చేయాలని కోరారు. సభ్యులు అందరూ జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని తెలిపారు. జిల్లాకు పప్పు దినుసుల పథకంలో భౌతిక లక్ష్యం 129019, ఆర్థిక లక్ష్యం 119.80 లక్షలు, చిరు ధాన్యాల పథకంలో భౌతిక లక్ష్యం 8582, ఆర్థిక లక్ష్యం 99.46 లక్షలు, నూనె గింజల పథకంలో భౌతికలక్ష్యం 9388, ఆర్థిక లక్ష్యం12.53 లక్షలు మండలాల వారిగా కేటాయింపులు జరిగాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆత్మ జీ.రాంకిషన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్ కుమార్, డీడీఎం నాబార్డ్ అబ్దుల్ రౌఫ్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కృషి విజ్ఞాన కేంద్రం సహాయ సంచాలకులు ప్రవీణ్‌రావు, కే .శివకుమార్, అష్రఫ్, రవీందర్, ఉద్యానవన అధికారి కార్తీక్, స్వయం సహాయక సంఘ సభ్యురాలు పాల్గొన్నారు.

చలి పంజా..!

- రాష్ట్రంలోనే అత్యల్ప స్థాయికి పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్ జిల్లాలో 7డిగ్రీలు..కుమురంభీంలో 7.3డిగ్రీలు
- నిర్మల్ జిల్లా పెంబీలో 8.3డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- గజగజ వణుకుతున్న ఉమ్మడి జిల్లావాసులు
- జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్న వైద్యులు

ఉమ్మడి జిల్లాను పులితో పాటు చలి కూడా గజగజ వణికిస్తోంది. బెబ్బులి కారణంగా పొలాలకు వెళ్లేందుకు జంకుతుండగా.. చలి కారణంగా ఉదయం..రాత్రి వేళలో ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు భయపడాల్సి వస్తోంది. అటు పులి..ఇటు చలి తీవ్రతతో జనాలు బెంబేలెత్తుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఏకంగా ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పరిమితం కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఆదిలాబాద్ జిల్లాలో ఏకంగా 7డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలకు పడిపోగా.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ 7.3డిగ్రీలకు దిగజారాయి. నిర్మల్ జిల్లాలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. చలి తీవ్రతకు వృద్ధులు,చిన్నారులు అనారోగ్యానికి గురవుతుండగా..వివిధ చిరు వ్యాపారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క చలి భారి నుంచి రక్షించుకునేందుకు జాగ్రత్తలు పాటించడమే కీలకమని వైద్యులు చెబుతున్నారు.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాతావరణ పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. ఇక్కడ ఎండ..వాన..చలి మూడు కాలాలు తీవ్ర ప్రభావం చూపిస్తుంటాయి. ఒకదానికొకటి పోటీ పడి విజృంభిస్తుంటాయి. రాష్ట్రంలో అధిక ఎండలు ఇక్కడే నమోదవుతుండగా.. కొన్ని సార్లు మినహా సాధారణం కంటే అధిక వర్షాలు సైతం నమోదవుతుంటాయి. ఇక చలి సైతం తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 7డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం ఆదిలాబాద్ జిల్లా బేలలో 7డిగ్రీలు నమోదు కాగా.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో 7.3డిగ్రీలు, నిర్మల్ జిల్లా పెంబీలో 8.3డిగ్రీలు నమోదయ్యాయి. వీటితో పాటు ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్, అర్లి(టి)లో 7.2డిగ్రీలు, సొనాల, బజార్‌హత్నూర్‌లో 7.3డిగ్రీలు, మావలో 7,4డిగ్రీలు, నేరడిగొండలో 7.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దాదాపు జిల్లాలోని మిగితా ప్రాంతాల్లోనూ కేవలం 10డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జిల్లావాసులు చలి తీవ్రతకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బయటకెళ్లాలంటే వణుకు..!

గత రెండేండ్ల క్రితం భీంపూర్ మండలం అర్లి(టి)లో ఏకంగా 2 డిగ్రీలకు పడిపోయిన సందర్భాలున్నాయి. ఈ ఏడాది సైతం అదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. చలి ప్రభావం కారణంగా ఉదయం..రాత్రి వేళలో ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఎండలో ఉన్నా చల్లని వాతావరణమే కనిపిస్తోంది. గత మూడు రోజుల క్రితం తుఫాను ప్రభావం కారణంగా వాతావరణం చల్లబడినప్పటికీ చలి తీవ్రత కనిపించలేదు. కానీ తుఫాను ప్రభావం వీడిపోవడం.. ఉత్తరాంధ్ర నుంచి వీస్తున్న చల్లని గాలుల కారణంగా మళ్లీ చలి తీవ్రత విజృంభిస్తోంది. దీంతో రోజు ఉదయం విధులకు వెళ్లే పారిశుధ్య కార్మికులు, పాల వ్యాపారులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం వేళలో బడులకు వెళ్లే చిన్నారులు సైతం చలిని తట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో తీవ్రత మరింత అధికంగా కనిపిస్తోంది. అటవీ ప్రాంతాల నుంచి వీస్తున్న గాలుల కారణంగా రోజంతా చల్లని వాతావరణమే కనిపిస్తోంది. పశువులకు సైతం గోనె సంచులు కప్పి రక్షణ కల్పిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవడమే మేలు..!

చలి తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవడమే మేలని వైద్యులు సూచిస్తున్నారు. గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ ఉదయం, రాత్రి వేళల్లో చలి మంటలు వేసుకొని రక్షణ పొందుతున్నారు. ముఖ్యంగా అస్తమా వ్యాధిగ్రస్తులు, వివిధ వ్యాధులతో దీర్ఘకాలికంగా సతమతమయ్యేవారు చలి తీవ్రతకు మరింత అనారోగ్యం బారిన పడుతున్నారు. ముఖ్యంగా అనేక మంది చిన్నారులు సైతం దగ్గు, జలుబు వంటి సమస్యల బారినపడుతున్నారు. ఈ క్రమంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వెచ్చని దుస్తులు ధరించడంతో పాటు గోరువెచ్చని నీటిని తాగడం, దుమ్ముధూళి వెళ్లకుండా ముక్కు, చెవులకు మాస్కులు ధరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.







మెరుగైన ఆరోగ్యంతో పాటు మెనూ పాటించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో జిల్లాలో కొనసాగుతున్న అన్ని రకాల సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మెనూలో పేర్కొన్న విధంగా సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్‌తో కలిసి ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో కొనసాగుతున్న పాఠశాలలు, వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, ప్రత్యేక అధికారులు, వార్డెన్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ వసతి గృహాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 20 శాతం పెంచిందని, విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ఆహారం తయారీకి వినియోగించే సరుకులు గదులలో నిలువ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, వంట గదులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు అందించే తాగునీరు, వంటలలో వినియోగించే నీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. వంట సరుకులను క్రమ పద్ధతిలో వినియోగించాలని, స్టాకు అధిక మొత్తంలో ఉండకూడదని, బియ్యం నిల్వ చేసే గదులలో బియ్యం సంచులు గోడకు ఆనుకొని ఉంచకూడదని, కొంత ఖాళీ స్థలం ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈనెల 14న ప్రతి విద్యాలయంలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా సమన్వయంతో కృషి చేయాలన్నారు. విద్యార్థులకు అందించే మెనూ పట్టిక ఫ్లెక్సీలను వంటగది, భోజనశాల వద్ద ప్రదర్శించాలని, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కార్యక్రమానికి ఆహ్వానించి, హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అతిథులకు నాణ్యమైన భోజన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పెంచిన డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలపై అందరికీ అవగాహన కల్పించాలని, విద్యార్థులతో తెలంగాణ సంస్కృతిపై సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని, వచ్చే 3 నెలల కాలంలో సిబ్బందికి, ఉపాధ్యాయులకు, కార్మికులకు కిచెన్, డైనింగ్, వంట సరుకుల నిర్వహణపై శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల ఉపసంచాలకులు సజీవన్, జిల్లా విద్యాధికారి ఉదయ్ బాబు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ మహామ్మరిని తరిమెందుకు కృషి

నవతెలంగాణ-కుభీర్

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విఠలేశ్వర్ ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ పెంటాజీ అన్నారు. గురువారం మండలంలో విఠలేశ్వర ఆలయానికి ఉపాధ్యాయ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆలయానికి 300 స్టీల్ ప్లేట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ అనేక రోగాలు సంభవించి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీంతో వాటిని నియంత్రించి, స్టీల్ పేట్లు వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నగేష్, సంగి రాజేశ్వర్, దత్త్రాత్రి, లక్ష్మణ్, గంగాధర్, పోతన్న, గిరి, దత్త్రాత్రి, ఆలయ కమిటీ సభ్యులు సూది రాజన్న, నగలింగం గ్రామస్తులు ఉన్నారు.

ఉద్యమకారుల మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు చిల్కూరి భూమయ్య అధ్యక్షతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ బషీర్, ఉపాధ్యక్షులుగా గుండాల రాజారాం, రంజాన్, ప్రధాన కార్యదర్శిగా బత్తుల అశోక్, కార్యదర్శిగా రాథోడ్ గణపతి, కదం సూర్యకాంత్, సంయుక్త కార్యదర్శిగా పెంట గంగాధర్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ, రాజన్న, బొడ్డు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలు సర్సరీలను పరిశీలించిన డీఆర్‌డీఓ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని లంబాడీతాండ(కే), సోమగూడెం(కే) నర్సరీలను డీఆర్డీఓ కిషన్ పరిశీలించారు. నర్సరీలను జాగ్రత్తగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కోనూర్ గ్రామంలో పశువుల పాక, కాంపోస్ట్ ఫీట్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నవీన్ కుమార్, ఈసీ మల్లేశ్, టీఏలు అనూష, వినోద్ కుమార్, శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్మణ్, సతీశ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను కొనసాగించాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఆర్ఓ వాటర్ ప్లాంట్ టెండర్ పిలిచి గతంలో పని చేసిన కార్మికులను కొనసాగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం శ్రీరాంపూర్ సీఐటీయూ కార్యాలయంలో కాంట్రాక్టు కార్మికులతో సమావేశంలో మాట్లాడుతూ శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలో పర్మనెంట్ కార్మికులకు, అధికారులకు శుద్ధమైన మంచినీటిని అందించాలనే లక్ష్యంతో కృష్ణకాలనీ, నస్పూర్ ఏరియాలల్లో మూడు ఆర్వో వాటర్ ప్లాంట్లను సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిందన్నారు. దీనిలో వాటర్ సప్లైగా పనిచేయడానికి టెండర్ ద్వారా కాంట్రాక్టు కార్మికులను తీసుకున్నారని, అయితే ఆ టెండర్ గడువు ముగిసి 7 నెలలు అవుతున్నా ఇప్పటివరకు కొత్త టెండర్ పిలవకుండా ఆ పాత కార్మికులకు పని కల్పించకపోగా, సివిల్ డిపార్ట్మెంట్ నుంచి కాంట్రాక్ట్ కార్మికులను తీసుకువచ్చి పనిచేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. తోటి కార్మికుల పొట్టలు కొడుతూ, వారు చేయాల్సిన పనిని కాకుండా వేరే సెక్షన్ నుండి తీసుకువచ్చి, సివిల్ కార్మికులతో అధికారులు ఆర్వో ప్లాంట్‌లో పని చేయించేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారని ప్రశ్నించారు. వెంటనే ఏరియా సివిల్ డీవై జీఎం స్పందించి ఆర్వో ప్లాంట్ టెండర్ను పిలిచి గత కార్మికులతోనే విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా సివిల్ కార్మికులతో పనిచేస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకొని డిమాండ్ చేశారు. లేనియెడల ఆ కార్మికులతో ఆందోళన, పోరాటాలకు సైతం సిద్ధమైతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సహాయ కార్యదర్శి కాసిపేట రాజేశం, సురేష్, రాజు, వెంకటేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడల్లో రాణించాలి


- జైపూర్ తహసీల్దార్ వనజారెడ్డి

జైపూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్-2024 క్రీడాకారులు జిల్లా స్థాయి ఆటల పోటీల్లో విజేతలుగా నిలువాలని స్థానిక తహసీల్దార్ వనజారెడ్డి ఆకాంక్షించారు. మండల స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల ముగింపు సంధర్భంగా గురువారం స్థానిక సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో విజేతలైన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతిబాపు రావుతో కలిసి క్రీడాకారులను ఉద్దేషించి మాట్లాడారు. మండల స్థాయిలో క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడా కారులు ఇదే ఉత్సాహం జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ప్రదర్శించాలని కోరారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొంది మండలానికి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. చదువుతో పాటు ఆటలపోటీల్లో రాణించడం ద్వార సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ విద్యాసాగర్, ఎంపీఓ శ్రీపతి బాపురావు, పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్ రావు, ఫిజికల్ డైరెక్టర్ గోపాల్, సంతోష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



ఈజీఎస్ పనుల నిర్వాహణలో నిర్లక్ష్యం తగదు

- భీమారం ఎంపీడీఓ మధుసూదన్



నవతెలంగాణ-జైపూర్

గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వార చేపట్టాల్సిన పనుల నిర్వాహణలో తాత్సారం చేయరాదని స్థానిక ఎంపీడీఓ మధుసూదన్ సూచించారు. స్థానిక ఎంపీఓ సతీష్‌రెడ్డి, ఎంపీఓ జీనత్ తబస్సుమ్‌తో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ పనుల నిర్వాహణపై సమీక్షించారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో జర్మినేషన్, మెటీరియల్ కాంపోనెంట్ పనుల తీరును అడిగి తెల్సుకున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఫార్మేషన్ రోడ్డులు గుర్తించడమే కాకుండా 15 రోజుల వ్యవధితో పూర్తి చేయాలని అన్నారు. అదేవిధంగా ఉన్నతి ట్రైనింగ్ కోసం 10వ తరగతి ఉత్తీర్ణత పొంది ఆసక్తి గల వారిని ఊట్నూర్‌లో శిక్షణ కోసం అబ్యాసకులను గుర్తించాలని తెలిపారు. 18 నుండి 44 సంవత్సరాల వయస్సు గల వారికి మగ్గం వర్క్, టూ వీలర్ మెకానిక్, ఫోటోగ్రఫీలో శిక్షణ పొందడానికి ఆసక్తి గల వారిని గుర్తించాలని సూచించారు. లేబర్ బడ్జెట్ సంబంధిత పనులు గ్రామ పంచాయతీల వారిగా కొత్త పనులు గుర్తించాలని అన్నారు. ఈ సమావేశంలో ఈజీఎస్ ఏపీఓతో పాటు సాంకేతిక నిపుణులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ యూత్ అధ్యక్షులకు సన్మానం

నవతెలంగాణ-నార్నూర్



ఇటీవల వారం రోజుల కింద యూత్ కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా షేక్ నసీర్, యూత్ మండల అధ్యక్షుడిగా ముబసీర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఉట్నూర్‌లో కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ వారిని అభినందించి, శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయిలో ప్రచారం చేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పోరాటలతో ప్రభుత్వ మెడలు వంచాలి : సీఐటీయూ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోరాటాల ద్వారా ప్రభుత్వ మెడలు వంచి డిమాండ్లను సాధించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న దీక్ష శిబిరాన్ని గురువారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులపై చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి హక్కులను సాధించుకుంటామని అన్నారు. ఇందుకు తమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని స్పష్టం చేశారు. భావోద్వేగంగా ప్రసంగించి ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉన్నారు.



48 గంటల పాటు మధ్యాహ్న భోజనం బంద్

- కలెక్టరేట్ ఎదుట 16, 17న మహాధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, గుడ్ల బిల్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16, 17న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపడుతూ 48 గంటల పాటు పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటలు బంద్ చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న తెలిపారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల చిన్నన్న మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రూ.పది వేలు ఇవ్వాలని, అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. గుడ్లకు బడ్జెట్ కేటాయించాలని, లేదా అంగన్‌వాడీ సెంటర్లకు పంపిణీ చేసినట్లు పంపిణీ చేయాలన్నారు. అవసరమైన గ్యాస్ సబ్సిడీకి ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. కాటన్ బట్టల యూనిఫామ్ ఇవ్వాలన్నారు. సామాజిక భద్రత కల్పించాలని మధ్యాహ్న భోజన నిర్వహణను, అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వరాదన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంక్ ద్వారా రుణాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మికులు సంగీత, కవిత, నాయకులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ మాట నిలబెట్టుకోవాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సుప్రీంకోర్టు నిర్ణయం ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తానని, అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి బుర్రి సతీష్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మిడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణం చేపట్టటకై, ఎస్సీ వర్గీకరణను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలులోకి తీసుకురావాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణను దేశంలో తామే ముందు అమలు చేస్తామంటూనే అమలు చేయకుండా తీరని అన్యాయం మాదిగలకు చేస్తున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం రాజకీయాలకు అతీతంగా మాదిగ బిడ్డలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ రెండు నెలల సమయం వేరే ఏ పని పెట్టుకోకుండా ఉద్యమం కోసమే పని చేయాలని, ఏ పిలుపు ఇచ్చినా ఆ పిలుపును అమలు చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణను 58 కులాలు కోరుతున్నాయని, ఒక్క మాల సామాజిక వర్గమే వ్యతిరేకిస్తోందని అన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గైక్వాడ్ సూర్యకాంత్, టౌన్ ఇన్‌చార్జీ మడిపల్లి మనోజ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆరేపల్లి గణేష్, శ్రీనివాస్, తోట విజయ్ ఉన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా కోర్టులలో సంవత్సరాలపాటుగా పరిష్కరించబడని కేసులు రాజీ పడటం వల్ల తక్షణం పరిష్కరించబడి సమయం, డబ్బులు, వృధా కాకుండా ఉంటాయన్నారు. లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయాన్ని పొంది ఉపశమనం పొందవచ్చని తెలిపారు. ముఖ్యంగా లోక్‌అదాలత్ ద్వారా చట్టరీత్యా రాజీకీ అర్హమైన క్రిమినల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి తగాదా సంబంధించిన కేసులు, కుటుంబ సమస్యల కేసులు, భార్యాభర్తల తగదా కేసులు, బ్యాంకు కేసులు, ఇన్సూరెన్స్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు ప్రమాదాల సంబంధించిన కేసులు, వైవాహిక వివాద కేసులు, చిట్ ఫండ్స్ కేసులు అన్ని రకాల కేసులను ఈ జాతీయ లోక్‌అదాలత్ నందు ఇరు వర్గాల కక్షిదారులు సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. చిన్నచిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృధా చేసుకోకుండా న్యాయవ్యవస్థ అందించిన ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో లోక్‌అదాలత్ సందర్భంగా ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి, లోక్ అదాలత్‌లో రాజీ కావల్సిన కక్షిదారులు రాజమార్గంలో పోలీస్ స్టేషన్ సిబ్బందిని సంప్రదించవచ్చని తెలియజేశారు. కోర్టు విధులను నిర్వర్తించే సిబ్బంది రాజీ కావాల్సిన ఇరు వర్గాల వారికి సమాచారం అందించి న్యాయమూర్తి వద్దకు తీసుకువెళ్తారని పేర్కొన్నారు.

ఉరేసుకొని గ్రామపంచాయతీ కార్మికుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఉరేసుకొని గ్రామపంచాయతీ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని ప్రబుద్ధ నగర్‌కు చెందిన వాగ్మారే క్రాంతి కుమార్ (36) గత కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి భరించ లేక గురువారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతను గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

- నిమిషం ఆలస్యమైన అనుమతి లేదు
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి సంబధిత అధికారులతో గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నిర్మల్ పట్టణంలో 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 8,080 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. డిసెంబర్ 15న ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు, అలాగే 16న ఉదయం10 గంటల నుంచి 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచనల ప్రకారం అభ్యర్థులు వ్యవహరించాలని, మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్స్, స్మార్ట్ వాచీలు వంటి వస్తువులతో రాకూడదని అన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. కేంద్రాలలో విద్యుత్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని, టాయిలెట్స్, తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, పొరపాట్లకు తావు లేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించేలా అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలపై శిక్షకులు రవికుమార్ పరీక్షల నిర్వహణపై అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంలో పరీక్షల కోఆర్డినేటర్ పీజీ రెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారులు, గోవింద్, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, అంబాజీ, రమణ, కిరణ్ కుమార్, శ్రీనివాస్, సుదర్శన్, సుభాష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- అమరవీరులకు సమగ్ర ఉద్యోగుల నివాళ్లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ అందిస్తున్న పాలన అసలైన ప్రజాపాలన అయితే పీసీసీ అధ్యక్షుడి హోదాలో తమకు ఇచ్చిన హామిని ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ డిమాండ్ చేశారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ప్రతి నిత్యం వివిధ రూపాల్లో నిరసనను తెలియజేస్తున్న ఉద్యోగులు గురువారం ఆర్‌అండ్ బి అతిథి గృహం వద్దనున్న తెలంగాణ అమరుల వీరుల స్తూపం వద్ద నివాళులర్పించి, తమ నిరసనను వ్యక్తం చేశారు. అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రమని, 129 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు కూడా అమరులయ్యారని, అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమని పడాల రవీందర్ అన్నారు. నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకశిల పార్కులో తమ ఆందోళనకు మద్దతు తెలిపిన సమయంలో కాంగ్రెస్ అధికారంలో చేపట్టగానే టీ తాగినంత సమయంలో మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఏడాది ప్రజా విజయోత్సవాలు కూడా జరుపుకుంటున్నారని, అయినా తమ గోడును పట్టించుకోవడం లేదన్నారు. సీఎం మాట కోసం 19,360 కుటుంబాలు ఎదురుచూస్తున్నాయన్నారు. వెంటనే తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, చిత్తశుద్ధి చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దేవదర్శన్, వినోద్, ప్రకాష్, కేశవ్, ప్రియాంక, మల్లిక, సలీం, సందీప్, సురేందర్, వెంకన్న పాల్గొన్నారు.

డిసెంబర్ చివరి నాటికి ఇండ్ల సర్వే పూర్తి చేయాలి

- అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించిన మొబైల్ యాప్ ద్వారా నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి సర్వే ప్రక్రియను ఈనెల డిసెంబర్ చివరి నాటికి ఎలాంటి తప్పులు దొర్లకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వేయర్‌లకు సర్వే పట్ల ఉన్న సందేహాలను నివృత్తి చేసి పలు సలహా సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా, పూర్తి పారదర్శకంగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం జిల్లాలో 1 లక్ష 97 వేల 448 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేలా చూడాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపల్ డివిజన్లు, వార్డుల వారీగా 500 మంది దరఖాస్తుదారులకు ఒకరు చొప్పున సర్వేయర్‌ను, ఐదుగురు సర్వేయర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించడం జరిగిందన్నారు. కొత్తగా నియమించబడిన సర్వేయర్లు ఎవరైనా ఉంటే, ఇప్పటికే ఉన్న వారికి ఎవరికైనా మొబైల్ యాప్ వినియోగం, ప్రభుత్వ మార్గదర్శకాలపై పరిపూర్ణమైన అవగాహన శిక్షణ అవసరమైతే తెలియజేయాలని అన్నారు. ఈనెల 13,14 తేదీలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు ఒక రోజు ముందుగానే టామ్ టామ్ వేయించాలని, ఒక్కో సర్వేయర్ రోజుకు కనీసం 25 ఇండ్లను సందర్శించి, సర్వే జరిపేలా ప్రణాళికాబద్ధంగా, గడువులోపు పూర్తి చేయాలన్నారు. అలాగే సర్వేకు వెళ్లడానికి ఒకరోజు ముందే దరఖాస్తు దారులకు సమాచారం అందించాలని, అవసరమైన డాక్యుమెంట్లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా ఇందిరమ్మ కమిటీలు సర్వే ప్రక్రియలో భాగస్వామ్యం కావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి సంబంధిత మండల, మున్సిపల్ అధికారులు, సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మట్, ఆర్డీఓ వినోద్ కుమార్, జెడ్పీ సీఈఓ జితేందర్, ఈడీఎం రవి, ఎంపీడీఓలు, ఎంపీఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అర్హులైనవారికి ఇందిరమ్మ ఇండ్లు : కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తొలుత అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు వర్తింపజేస్తామని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. లబ్ధిదారుల పారదర్శక ఎంపిక కోసం సర్వే చేపడుతోంది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణంలో వార్డు అధికారులకు దీని బాధ్యతలను అప్పగించింది. ఇందు కోసం ప్రత్యేకంగా మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించిన ప్రభుత్వం నేరుగా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయిస్తోంది. కాగా గురువారం ఆదిలాబాద్ గ్రామీణ మండలం చాందా(టి), భీంసరి గ్రామాలతో పాటు పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌లో కొనసాగుతున్న సర్వేను కలెక్టర్ రాజర్షిషా గురువారం పరిశీలించారు. సర్వే సిబ్బందితో కలిసి పేదలతో మాట్లాడి వారి కుటుంబ ఆర్థిక స్థితిగతులు, సభ్యుల సంఖ్య, ప్రస్తుతం నివాసముంటున్న ఇంటి పరిస్థితి, నివాసయోగ్యంగా ఉందా లేదా వంటి వివరాలను ఆరా తీశారు. సొంత ఇంటి స్థలం ఉందా, ఉంటే దానికి సంబంధించిన ధ్రువపత్రాలు, అవి లేని పక్షంలో ఇంటి పన్ను రసీదులు, తెల్ల రేషన్‌కార్డు వివరాలను పరిశీలించారు. లబ్ధిదారుడితో పాటు ఇంటి పైకప్పు, స్థలానికి సంబంధించిన చిత్రాలను యాప్లో అప్లోడ్ చేస్తున్నారు. తొలుత గిరిజనులు, దళితులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఉపాధి కూలీలు, పారిశుధ్య కార్మికులకు ఇండ్లను కేటాయించాలని అన్నారు. ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినందున వారి వివరాల నమోదుకు ప్రాధాన్యమిస్తున్నారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి పద్మభూషన్ రాజు, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ స్వప్నశీల, చాందా(టి), భీంసరి గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అభి, మల్లారెడ్డి ఉన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు : ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డిసెంబర్ 15, 16 తేదీలలో జరిగే టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో అయా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144, 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్-2023 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని పేర్కొన్నారు. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఊరేగింపులు, దర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని పేర్కొన్నారు. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, దర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. ట్రాఫిక్ ఆంతరాయం కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

రాజకీయ నాయకులు పోలీసులకు సహకరించాలి..

వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఆదేవిధంగా పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్టు పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈఓ పరుశు రాం నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గౌతం, అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, నిత్యం విద్యార్థుల హాజరును నమోదు చేయాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇటీవల ఇంటర్ బోర్డుకు కొత్త కార్యదర్శి నియమితులయ్యారని వారి ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో పోషకుల సమావేశం నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తుకు మార్గ నిర్దేశాలను తల్లి తండ్రులకు తెలియజేయాలన్నారు. ప్రతి విద్యార్థికి 90 రోజుల ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గౌతం, అధ్యాపకులు విఠల్, ప్రమీల రాణి, శ్రీనివాస్, నవీన్, చిన్నయ్య, మహేందర్, హరీష్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతుల ఎదురుచూపు



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి పశు వైద్యశాలలో విధులు నిర్వహించే వైద్యులు బుధువారం రాకపోవడంతో ఆ గ్రామ రైతులకు సంబదించిన పశువులకు వైద్యం అందించే వైద్యులు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఏదురుకోవడం జరిగింది. దింతో ప్రభుత్వం పేద మధ్య తరగతులకు సంబదించిన రైతులకు సంబదించిన పశుల వైద్యశాల లో డాక్టర్లను నియమిస్తే కానీ ఎక్కడి వైద్యులు మాత్రం అస్పత్రి కి రాకుండానే వేలకు వేలు జీతాలు తీసుకోవడం జరుగుతుంది. ప్రతి రోజు ఉదయం సమయంలో పశు వైద్యశాలకు వచ్చి గ్రాములో ఉన్న పశువులకు ఎలాంటి వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు పరిశీలించలిసిన అధికారి సమయ పాలనా పాటించకుండానే ఇష్టం వచ్చినప్పుడు అస్పత్రి కి రావడం జరుగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు దింతో బుధువారం ఉదయం సమయంలో ఓ రైతులు సంబదించిన ఎద్దులు మరియు ఒక్క గేదెను అస్పత్రికి తీసుకువస్తే అక్కడ చికిత్స అందించే డాక్టర్ లేకపోవడంతో రైతులు వేనుదిరాగారు. దింతో ప్రయివేట్ వైద్యుల వద్దకు వెళ్ళే పరిస్థితి ఏర్పడింది. దింతో ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు కల్పించుకొని డాక్టర్ ను ప్రతి రోజు అస్పత్రికి వచ్చేటట్లు చూడాలని గ్రామస్తులు కోరారు

108ను అందుబాటులోకి తేవాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలో 108 అంబులెన్స్‌ను అందుబాటులోకి తేవాలని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్‌లో గత కొన్ని రోజులుగా 108 సేవలు నిలిచిపోయాయని అన్నారు. కొంతకాలంగా ఖానాపూర్‌లో 108 అంబులెన్స్ లేకపోవడంతో ప్రజల్లో ఆందోళన మొదలైందని అన్నారు. నిత్యం ఎంతో రద్దీగా వాహనాల రాకపోకలతో రోడ్డు ప్రమాదాలతో పాటు గ్రామాల్లో పట్టణాల్లో సకాలంలో ఆస్పత్రి వచ్చే రోగులకు ఎమర్జెన్సీ సేవగా ప్రజలను కాపాడే 108అంబులెన్స్‌ను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు సుద్దాల మహిపాల్, మునుగురి ప్రణీత్, మహమ్మద్ అర్షద్, లాజర్, సాయికృష్ణ, గాజుల అజయ్, చుక్కల నరేష్, సంజయ్, వంశీ, దయాకర్ పాల్గొన్నారు.

నిరసన తెలిపిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగులు మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తమను రెగ్యూలర్ చేస్తామని, ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు ఆందోళన ఆగదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | డిసెంబర్ 13, 2024 | www.navatelangana.com

ప్రారంభమైన ఇందిరమ్మ ఇండ్ల సర్వే

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను నిర్వహిస్తున్నారు. గురువారం ఎలుకపెల్లి గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీడీఓ అల్బర్ట్ పరిశీలించారు. ప్రజాపాలన దరఖాస్తులు ఇచ్చిన వారి ఇండ్లకెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. ఇంటి స్థలం, లోకేషన్, ఇంటి పైకప్పుతో పాటు లబ్ధిదారుడి వివరాలను ఆన్‌లైన్‌లోని యాప్‌లో నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఇటీవల కాంగ్రెస్‌లో చేరి మొదటిసారిగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సక్కు తిరిగి పార్టీలో చేరడం సంతోషంగా ఉందని, నియోజకవర్గంలో పార్టీ క్షేత్రస్థాయిలో మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల ప్రెసిడెంట్ మసాదే చరణ్, మాజీ ఎంపీపీ బాలేశ్ గౌడ్, యూత్ జిల్లా అధ్యక్షుడు శ్యాం, షేక్ అసద్, డాక్టర్ రూప్నర్ రమేష్, షేక్ కలీం, వైరాగడే మారుతీ, నాగోసే శంకర్, బండి సాయి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటిన ఆర్టీసీ సిబ్బంది

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బస్సులో ప్రయాణం చేసి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను మర్చిపోయి దిగిన ప్రయాణికునికి వాటిని ఆర్టీసీ సిబ్బంది అందజేసి వారి నిజాయితీ చాటుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ చంద్రపూర్ నుండి ఆసిఫాబాద్ డిపోకు చెందిన బస్సులో ప్రయాణం చేసి, బస్సులో ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను మర్చిపోయి జాడే శృతికి దిగిపోయారు. గమనించిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ వెంటనే తన సమాచారం అందించడంతో విషయం తెలియజేసి వాటిని అందజేశామన్నారు. ఈ విషయంపై జాడి శృతి ఫిర్యాదు చేయగా తిరిగి ఆమెకు మహారాష్ట్రలోని రాజుర డిపో బస్ స్టేషన్‌లో కండక్టర్ గుండా శ్రీనివాస్, శృతి తమ్ముడు శ్రావణ్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా వారు ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ అల్బర్ట్ అన్నారు. మండలంలోని ఎల్లూరు ఆశ్రమ పాఠశాల, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి రమేష్‌బాబుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలో గ్రామ పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య పనులను చేయించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటశాల వద్ద నీరు నిల్వ ఉండటాన్ని చూసి నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు పరిశుభ్రతతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయులు తిరుపతి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఉన్నారు.

ఓపెన్ పది ప్రవేశ తేదీ పొడిగింపు

నవతెలంగాణ-కౌటాల

ఓపెన్ 10వ తరగతి ప్రవేశ తేదీ ఈ నెల 16 వరకు పొడిగించినట్టు గుండాయిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొడెం నానాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు, ఓపెన్ 10 చదవాలనుకుంటే ఈనెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొవాలన్నారు. ఇతర వివరాలకు 9494029826, 9849823929 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొలాం సంఘం ఆరోపణలు అర్ధరహితం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఆదివాసీ కొలవార్ తెగ కొలాం సంఘ నాయకులు కొలవార్‌లు ఎస్టీలు కాదని దుష్ప్రచారం చేయడం అర్ధరహితమని కొలవార్ సేవా సంఘం మండల అధ్యకుడు గట్లె శంకర్ ఆరోపించారు. మండల కేంద్రంలోని కుమురం భీం విగ్రహం వద్ద చలో బెజ్జూర్ ఆదివాసీ కొలవార్ హక్కుల ఆత్మగౌరవ సభ పోస్టర్లు గురువారం విడుదల చేస్తూ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొలవార్ తెగకు చెందిన మేము రాజ్యాంగ బద్ధంగా ఐఎస్టీ జాబితాలో 1950 సంవత్సరం నుండి నేటి వరకు ఎస్టీ హోదాలో ఆదివాసీ తెగలలో అత్యంత వెనుకబడిన తేగగా జీవిస్తున్నామన్నారు. 2003 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం తమను మన్నెవార్లకు బదులుగా కోలవార్‌లుగా పార్లమెంట్‌లో చట్ట సవరణ చేయడం జరిగిందన్నారు. కొలవార్ చైతన్యాన్ని, ఐకమత్యాన్ని ఓర్వలేని కోలాం సంఘ నాయకులు వారి వ్యక్తిగత స్వార్థ ప్రయోజనం కోసం అవమానపరిచి కించపరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శుక్రవారం బెజ్జూరు మండలంలో జరగబోయే ఆదివాసీ కొలవార్ హక్కుల ఆత్మగౌరవ సభకు పెద్ద ఎత్తున తల్లి రావాలని కోరారు. కార్యక్రమంలో కొలవార్ సేవా సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎడ్ల వెంకన్న, గ్రామ అధ్యక్షుడు పూజారి కిష్టయ్య, యువజన కమిటీ అధ్యక్షులు మేకల ఫణిందర్, నాయకులు భవగన్, ఎడ్ల ఇస్తారి పాల్గొన్నారు.

పోలీస్ కళా బృందంతో విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని కేజీబీవీలో ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కళాబృందం చట్టాలపై అవగాహన కల్పించారు. నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, గంజాయి నివారణపై అవగాహన, సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, ఎవరైనా మోసపోతే వెంటనే 1930 నంబర్‌కి ఫిర్యాదు చేయాలని, అదేవిధంగా పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాల గురించి తెలుసుకుంటే భవిష్యత్తులో ఉపయోగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ, పోలీస్ కళా బృందం సభ్యులు రాంచందర్, చంద్రశేఖర్, రజిత, సంఘవి, విద్యార్థులు పాల్గొన్నారు.



హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ ఎప్పుడు..?

- డీఎంపీహెచ్‌ఏ కోర్సులు పూర్తిచేసిన పురుష అభ్యర్థులు
- 20 ఏండ్లుగా నిలిచిన నియామక ప్రక్రియ
- నోటిఫికేషన్ కోసం అభ్యర్థుల ఎదురుచూపు

చదువు మనిషికి జ్ఞానం తీసుకురావడమే కాదు..బతకడానికి ఓ దారి చూపిస్తుంది. జీవనం సాగించేందుకు ఉపాధి కల్పిస్తుంది. కానీ డీఎంపీహెచ్‌ఏ కోర్సులు పూర్తిచేసిన పురుష అభ్యర్థులకు మాత్రం ఎలాంటి ఉపాధి లభించక దీనస్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషించే పురుష హెల్త్ అసిస్టెంట్ పోస్టులను ప్రభుత్వం ఏండ్లుగా భర్తీ చేయకపోవడంతో సర్కారు కొలువు వారికి ఓ కలగానే మిగిలిపోతోంది. కోర్సు పూర్తిచేసి ఏండ్లు గడుస్తున్నా నోటిఫికేషన్లు వెలువడకపోవడంతో తీవ్ర అన్యాయానికి గురవుతున్నామని డీఎంపీహెచ్‌ఏ కోర్సు పూర్తిచేసిన పురుష అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 20ఏండ్లుగా నియామక ప్రక్రియ చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ప్రగతి భవన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అభ్యర్థులు(ఫైల్)

నవతెలంగాణ- కెరమెరి

ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ముఖ్య పాత్ర పోషించే డిప్లొమా ఇన్ మల్టి పర్పస్ హెల్త్ అసిస్టెంట్(డీఎంపీహెచ్‌ఏ-పురుష) పోస్టుల భర్తీ ప్రక్రియకు గ్రహణం పట్టుకుంది. నిత్యం ప్రజలతో మమేకమవుతు ప్రజల ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ అత్యంత కీలక పాత్రను పోషిస్తారు. అంటూ వ్యాధులు, విష జ్వరాలు, వాంతులు, విరేచనాలు, డెంగీ, మలేరియా, నీటి కలుషితవ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు సూచించే ఎంపీహెచ్‌ఏ(పురుషులు) ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో కనిపించడం లేదు. దీంతో ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన లోపం ఏర్పడి విష జ్వరాల బారిన పడి ఇబ్బదులు పడుతున్నారు.ఏళ్లుగా భర్తీకి నోచుకోని ఆరోగ్య కార్యకర్తల ఖాళీలను భర్తీ చేయాలని ఇటీవల హైదరాబాద్‌లో పలువురు మంత్రులను కలిసి విన్నవించారు. ఎంపీహెచ్‌ఏ మేల్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థుల సంఘం తరపున వినతి పత్రాలు అందజేశారు.

2002 నుంచి నిలిచిన భర్తీ ప్రక్రియ

రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఉన్న సిహెచ్‌సి, పీహెచ్‌సీలు, గ్రామీణ ఉప కేంద్రాలు, మున్సిపాలిటీలోని మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఉద్యోగాలు భర్తీ చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 వేల మంది డీఎంపీహెచ్‌ఎం (పురుష)కోర్సు పూర్తి చేసిన వారు ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 4వేల మంది ఉన్నట్లు సమాచారం. 2002 నుంచి నేటి వరకు రాష్ట్రంలో పురుష అభ్యర్థుల ఆరోగ్య కార్యకర్తల పోస్టులు భర్తీ చేయలేదని, ఈ కోర్సు పూర్తి చేసిన నిరుద్యోగుల వయస్సు పెరగడంతో ఉద్యోగ అర్హతను కోల్పోవాల్సి వస్తోంది. ఇరవై ఏళ్లుగా మహిళా అభ్యర్థుల పోస్టులను భర్తీ చేస్తున్న ప్రభుత్వం పురుష అభ్యర్థుల పోస్టుల నియామకంలో మాత్రం తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో ఒక పురుష, ఒక మహిళా ఆరోగ్య కార్యకర్తను నియమించాలని నిబంధన ఉన్నప్పటికీ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్‌లో ఇచ్చిన 8వేల పురుష ఆరోగ్య కార్యకర్తలు, 2వేల శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని వారు కోరుతున్నారు.



పీసీసీ అధ్యక్షుడికి వినతిపత్రం అభ్యర్థులు(ఫైల్)

ప్రభుత్వం నోటిఫికేషన్ వేసి పోస్టులు భర్తీ చేయాలి

రాథోడ్ రమేష్, డీఎంపీహెచ్‌ఏ సంఘం జిల్లా అధ్యక్షులు



డీఎంపీహెచ్‌ఏ కోర్సు పూర్తి చేసి అనేక ఏండ్లు అవుతోంది. ప్రభుత్వం ఆలస్యం చేస్తే అనేక మంది అభ్యర్థుల వయసు అర్హత దాటి పోతుంది. ఉద్యోగ నియమకాలు ఆలస్యం చేస్తే చాలా మంది నష్టపోతారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించాలి. 2002 నుంచి ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలి. వీటి భర్తీకి ఎన్నికల సమయంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ మేరకు పురుష ఆరోగ్య కార్యకర్తల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

క్రీడకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రస్థాయిలో క్రీడాకారులు ప్రతిభ చాటాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో మున్సిపల్ స్థాయి సీఎం కప్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే క్షేత్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వివిధ రకాల క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మండల, మున్సిపల్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాష్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం జంగు, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద గల క్రీడా మైదానంలో గురువారం సీఎం క్రీడలను ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రియాజ్ మహమ్మద్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఇందులో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడలను ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జాబిరె పెంటు, డిప్యూటీ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, క్రీడాకారులు, అధికారులు పాల్గొన్నారు.



నేటిలోగా అభ్యంతరాలు తెలపాలి

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని గ్రామపంచాయతీ వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటులో ఎలాంటి అభ్యంతరాలున్న శుక్రవారంలోగా తెలియజేయాలని ఎంపీడీఓ గౌరి శంకర్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల వివరాలను సభ్యులకు వివరించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే రేపటిలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ జాబితాలను ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల్లో ప్రచురించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్, బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కుమ్మరి తిరుపతి,





బీజేపీ నాయకులు సామల తిరుపతి, వసిఖాన్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అల్బర్ట్ అధ్యక్షతన మండలంలోని రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల సాదారణ ఎన్నికలు, గ్రామ పంచాయతీలో వార్డుల వారీగా ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాటు చేసిన 102 పోలింగ్ కేంద్రాల గురించి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అభ్యంతరాలుంటే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బొయిరె బండు, జునుగరి సుధాకర్, భిట్టు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోపు బియ్యం సరఫరా చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు నిర్ణీత గడువులోగా బియ్యం సరఫరా చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గల ఎంఎల్ఎస్ పాయింట్‌ను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్‌తో కలిసి సందర్శించి బియ్యం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్ నుండి కేటాయించిన ప్రకారంగా పాఠశాలలు, గురుకులాలు, అంగన్‌వాడీలకు నిర్ణీత సమయంలో బియ్యం సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. అనుమతిలేని వాహనాల ద్వారా సరుకులు సరఫరా చేయకూడదని, టెండర్‌లో పేర్కొన్న వాహనాలను మాత్రమే వినియోగించాలని, ఆ వాహనాలకు జీపీఎస్ ట్యాగ్ చేయాలని తెలిపారు. పాఠశాలలకు నాణ్యత గల బియ్యంలో సరఫరా చేయాలని, బియ్యం లోడుతో వెళ్లే వాహనం దారి మధ్యలో ఎక్కడ ఆగకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డీటీడీఓ రమాదేవి, డీఎం కార్పొరేషన్ వెంకట్ నర్సింహ, తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలన్నీ బూటకమే

నవతెలంగాణ-రెబ్బెన

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ బూటకమేనని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ అన్నారు. మండలంలోని నంబాల గ్రామంలో పోలింగ్ బూత్ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ఎన్నికల ప్రచారంలో డిక్లరేషన్ల పేరుతో ఇచ్చిన హామీలు బూటకం అయ్యాయని, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు 66 మోసాలు చేసి ప్రజలను అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి, విద్యార్థులకు స్కూటీలు ఇస్తామని, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం కూడా పెట్టడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు గుల్బం చక్రపాణి, మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నవీన్ గౌడ్, పోలింగ్ బూత్ అధ్యక్షులు బక్క ఆనంద్, కుమ్మరి శాంతయ్య, ముద్దం సత్యనారాయణ గౌడ్, జంగాపల్లి రాజేష్ పాల్గొన్నారు.

ఖాళీ టీ కప్పులతో మూడో రోజు నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ డిమాండ్ పరిష్కరించాలని చేస్తున్న సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట చేస్తున్న నిరసన దీక్ష మూడో రోజు ఖాళీ టీ కప్పులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి గతంలో వరంగల్ దీక్ష సందర్భంగా చాయ్ తాగేలోపు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని దానిని గుర్తు చేసే ఉద్దేశంతో ఖాళీ టీ కప్పులతో నిరసన తెలిపినట్లు వివరించారు. సమ్మె ప్రారంభమై మూడు రోజులైన ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పెన్ డౌన్ చేసిన నేపథ్యంలో కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యాబోధన పూర్తిగా ఆగిపోయిందన్నారు. సమ్మెకు అన్ని వర్గాలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక, కేజీబీవీ, యుఆర్ఎస్ ప్రత్యేక అధికారులు అరుణ, మీనా, నలంద, మీనా రమాదేవి, ధర్మయ్య, సుధారాణి, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పవార్ తుకారాం, గౌరవ అధ్యక్షులు కొప్పుల మోహన్, కోశాధికారి బోయిని నాగేష్ యాదవ్, మీడియా ప్రతినిధి గేడెకర్ సంతోష్, కేజీబీవీ ప్రత్యేక అధికారి పద్మ, కార్యదర్శి దుర్గం సందీప్, రాజేష్, అధికార ప్రతినిధి పవన్, సీసీఓ అధ్యక్షుడు అనూప్, ఎంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఐఈఆర్పీ అధ్యక్షుడు వెంకటరమణ, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, మెసెంజర్ అధ్యక్షుడు సంతోష్, డీపీఓ సిబ్బంది రాము, మల్లేష్ పాల్గొన్నారు.

సమ్మెకు పెరుగుతున్న మద్దతు

సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. మూడో రోజు సమ్మెకు సిర్పూర్ (టి) మండల విద్యాధికారి వేణుగోపాల్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వెంకటరాజయ్య, కిషన్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి హేమంత్ షిండే, జిల్లా కోశాధికారి రమేష్, టీపీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కటకం మధుకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి భోగే ఉపేందర్ మద్దతు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సినీ నటుడు మోహన్ బాబు జర్నలిస్టులపై దాడికి దిగడం హేయమైన చర్య అని మాజీ జడ్పీటీసీ అరిగేలా నాగేశ్వరరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో మోహన్ బాబు జర్నలిస్టుపై చేసిన దాడికి నిరసనగా ప్రింట్, ఎలక్ట్రాన్ మీడియా జర్నలిస్టులు రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలా జర్నలిస్టుపై దాడి జరగడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి జర్నలిస్టులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించి మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు వారధిగా పని చేస్తున్నారని, అట్టి వారిపై దాడులు జరగడం సిగ్గుచేటని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా మోహన్ బాబు జర్నలిస్టులకు బేశరత్తుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రేగుంట కేశవరావు, నారాయణ, నాగరాజు, రూప్నార్ రమేష్, దినకర్, కార్తీక్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | డిసెంబర్ 13, 2024 | www.navatelangana.com

అధికారులకు క్వార్టర్స్ కేటాయింపుకు కౌన్సిలింగ్

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న అధికారులకు జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ క్వార్టర్ కౌన్సిలింగ్ కమిటీ సభ్యులైన ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, ఎస్టేట్స్ ఆఫీసర్ మహేష్, డీవైపీఎం దేవేందర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అరుంధతి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కౌన్సిలింగ్‌లో 29 క్వాటర్లకు గాను 13 క్వాటర్లను అధికారులు తీసుకోవడం జరిగింది.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సమావేశం

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 2వ సాధారణ ఎన్నికలు 2024 భాగంగా గురువారం గ్రామపంచాయతీల వారీగా డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల జాబితా అభ్యంతరాలపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ షేక్ సఫ్దర్ అలీ, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మీ నారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, ఆయా పార్టీల నాయకులు రత్నం ప్రదీప్, సూరం సంపత్ కుమార్, నాయకులు రాంటింకి వాసుదేవ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొప్పు సుమన్
- జై భీమ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని యువజనుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని అల్ ఇండియా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షు బొప్పు సుమన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికయిన సందర్భంగా ఆయనను జై భీమ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్ఆర్‌తో సహా తనను ఎన్నుకొన్నందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సందెల సురేష్, జై భీమ్ సైనిక్ దల్ మండల అధ్యక్షుడు అలుగునూరి నరేష్, జై భీమ్ యుత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కోడి సుధాకర్, ప్రదాన కార్యదర్శి కోడి అజయ్, బొల్లం వంశీ, గుమ్మడి దినకర్, కోడి అశోక్, సూర జానీ, తీగల రాకేశ్, కోడి విలాస్, కోడి శ్రవణ్, జంగిలి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ పేరుతో వచ్చే ఫేక్ మెసేజ్‌ను నమ్మొద్దు

నవతెలంగాణ-జన్నారం

ఎస్‌బీఐ పేరుతో వచ్చే ఫేక్ మెసేజ్‌లను ప్రజలు నమ్మొద్దని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జన్నారం శాఖ మేనేజర్ మహేశ్ సూచించారు. ఎస్‌బీఐ రివార్డుల పేరుతో స్థానిక గ్రూపుల్లో ఏపీకే వస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ ఏపీకేను తెరవడం వల్ల ఫోన్ నుంచి విలువైన సమాచారం హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. అలాంటి లింకులు ఎవరూ తెరవ వద్దని, పూర్తి సమాచారం కోసం తమను సంప్రదించాలని కోరారు. ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెసేజ్‌లు ఓటీపీలు ఎవరికి చెప్పకూడదన్నారు.

కాపువాడలో ఫైలేరియా సర్వే

నవతెలంగాణ-తాండూర్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరు టీమ్‌లుగా విభజించి తాండూర్ గ్రామంలోని కాపువాడ ఎన్టీఆర్ కాలనీలో బోదకాలు వ్యాధి నిర్మూలనకు బుధవారం రాత్రి ఫైలేరియా సర్వే చేసి 306 రక్త నమూనాలను సేకరించినట్లు వైద్యాధికారి ఝాన్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీదివ్య సూపర్‌వైజర్‌లు తారా బాయి, రమాదేవి, దవులత్, హకీమ్ పాల్గొన్నారు.

జీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన హెచ్‌ఎంఎస్ నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణను హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ శ్రీరాంపూర్ కమిటీతో కలిసి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా కమిటీని, అన్ని గనుల పిట్ కార్యదర్శులను శ్రీరాంపూర్ జీఎంకు పరిచయం చేశారు. అదేవిధంగా శ్రీరాంపూర్‌లో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను జీఎం దృష్టికి తీసుకువెళ్లగా జీఎం వెంటనే స్పందించి తప్పకుండా పరిష్కరిస్తామని తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య బ్రాంచ్ కార్యదర్శి అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి జీవశాస్త్ర టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గురువారం ఎంఈఓ విజయ్ కుమార్ బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పెట్టడం వల్ల వారిలో దాగి ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుందన్నారు. ఈ టాలెంట్ టెస్టులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ నస్పూర్

ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. బొగ్గు లారీలపై పని చేస్తున్న మండ వైకుంఠం(70) బుధవారం రాత్రి ఆర్కే-7 గని సమీపంలో పనులు నిర్వహిస్తుండగా రామక్రిష్ణపూర్‌కు చెందిన రమేష్ ఇందారం గనికి వెళ్ళే క్రమంలో ద్విచక్ర వాహనంతో వైకుంఠంను ఢీకొట్టాడు. అతన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవీందర్

నవతెలంగాణ-తాండూర్

ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం స్థానిక గాంధీ వనం వద్ద నిర్వహించిన సమావేశంలో ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

- జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య

నవతెలంగాణ-కాసిపేట



విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత పాటించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను, తెలంగాణ మోడల్ స్కూల్‌తో పాటు మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా పాఠశాలలో టీచర్స్, నాన్ టీచింగ్ స్టాఫ్ హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్ అందరూ విధుల్లో ఉండగా, టీచర్స్‌లో నలుగురు విధుల్లో ఉండగా మిగితా వారు సమ్మెలో ఉన్నట్లు సిబ్బంది డీఈఓకు తెలిపారు. లీవ్‌లో ఉంటే తప్పకుండా లీవ్ లెటర్ ఉండాలని, లేదంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దింతో పాటు కస్తూర్బా పాఠశాలలో వంట నిర్వహణ గదులను, వంట సామాగ్రిని పరిశీలించారు. ఆహార నాణ్యతను తెలుసుకున్నారు. చెడిపోయిన పదార్థాలు ఏవీ వాడకూడదని సిబ్బందికి సూచించారు. అనంతరం మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని తిని నాణ్యతను పరిశీలించారు. తప్పకుండా మెనూ ప్రకారం భోజనం అందించాలని, నాణ్యత పాటించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం పాటిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డీఈఓ వెంట ఎంఈఓ ముక్తవరం వెంకటేశ్వర స్వామి ఉన్నారు.

కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై సమావేశం



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై గురువారం మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశం నిర్వమించారు. కమిటీ సభ్యులు డీజీఎంలు వై వెంకటరమణ, ఆర్వీఎస్ఆర్కే ప్రసాద్, రాజన్న, డీవైపీఎం ఎండీ ఆసీఫ్ ఆధ్వర్యంలో మొదటి, రెండవ, మూడవ షిఫ్టులో ఉద్యోగులకు మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత, లక్ష్యాలను సాధించిన విషయాలను, భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనులలో యంత్రాల వినియోగం, సింగరేణిలో అమలు చేస్తున్న సంక్షేమ, ఫైనాన్స్ విషయాలపై చర్చించారు. కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలు, కంపెనీ ముందున్న సవాళ్లను, కంపెనీ లక్ష్యాలను సాధించడానికి చేయాల్సిన పనులపై చర్చించారు. గని ఉద్యోగస్తులు కంపెనీకి సూచించిన సలహాలు సూచనలు పాటించడం వల్ల ఉత్పత్తి ఉత్పాదకత పెరుగుతుందని, నిబద్ధతతో తమకు కేటాయించిన పనులను చేయడం వలన అనుకున్న లక్ష్యాలను చేరుకుంటామని, తమ పనితనాన్ని మెరుగుపరచుకోవడం వలన లక్ష్య సాధన సులువు అవుతుందన్నారు. అనంతరం సింగరేణి సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి ఉత్పాదకతను పెంపొందించడానికి ఉద్యోగస్తుల నుండి సలహాలు సూచనలు తీసుకున్నారు. ఉత్తమ సలహాలు చెప్పిన ఉద్యోగులకు మొదటి, రెండవ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, సీఎంఓ ఏఐ అధ్యక్షుడు రమేష్, కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు, ఏరియా వర్క్ షాప్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఎస్ఓ టూ జీఎం విజయ ప్రసాద్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, పిట్ సెక్రటరీ శ్రీనివాస్, సంక్షేమాధికారి భార్గవ్ కార్మికులు పాల్గొన్నారు.

అడవులపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-జన్నారం



కార్బన్‌డయాక్సైడ్‌ను పొంది స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించే అడవులు మనిషి మనుగడకు దోహదం చేస్తాయని, అడవుల రక్షణపై అవగాహన ఉండాలని జన్నారం డిప్యూటి రేంజ్ అధికారి తిరుపతి పేర్కొన్నారు. గురువారం జన్నారం రేంజ్ పరిధిలో వివేకానంద పాఠశాల విద్యార్థులకు అడవులపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా బటర్‌ఫ్లై గార్డెన్, గ్రాస్‌ల్యాండ్, పార్కు, అధ్యాయన కేంద్రాలను పరిశీలించి, గేట్ నంబర్-1 నుంచి రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి అడవులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ అడవులను రక్షిస్తే భవిష్యత్తు తరాలకు మంచి జరుగుతుందన్నారు. ప్రత ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. చెట్లు ఉండడం వల్లనే వాతావరణం సమతుల్యతగా ఉంటుందన్నారు. అడవులను, వన్యప్రాణుల రక్షణపై మీ ఇళ్లలో తెలియజేయాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే మొక్కలను విరివిగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారి లాల్‌బాయి, ప్రిన్సిపల్ సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

అవసరాల మేరకు ఇసుక తరలించాలి

- తహసీల్దార్ వనజారెడ్డి

నవతెలంగాణ-జైపూర్



మండల పరిధిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల అవసరం మేరకు ఇసుక తరలించుకోవాలని స్థానిక తహసీల్దార్ వనజారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీధర్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ విద్యాసాగర్, ఎంపీఓ శ్రీపతి బాపురావుతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో కాంట్రాక్టు, ట్రాక్టర్ యజమానులతో సమావేశమయ్యారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్, ఎన్ఆర్ఈజీఎస పథకాల ద్వార చేపట్టిన పనులకు ఇసుక అవసరాలు తీర్చుకోవడం కోసం కలెక్టర్ ఆదేశాలను అనుసరించాలని తెలిపారు. సంబంధిత శాఖ ఏఈ సూచనల మేరకు ముందస్తుగా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని మండల కమిటీలో ఉన్నా తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్ఐ, మండల ఇంజనీర్లు ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్ నిర్ణయంతో ఇసుక అవసరాలు తీర్చుకోవాలని సూచించారు. మండల కమిటీ ద్వార అనుమతి పొందిన మూడు రోజుల వ్యవధితో అవసరమైన ఇసుక తరలించుకోవాలని తెలిపారు. అభివృద్ధి పనుల సాకుతో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే సహించేది లేదని, అక్రమ రవాణాకు ఎవరు సహకరించరాదని హెచ్చరించారు.

విద్యార్థులు కరాటేలో రాణించాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మారుతున్న సామాజిక పరిస్థితుల్లో విద్యార్థులు కరాటేలో రాణించాలని డ్రాగన్ స్వార్డ్ కుంగ్ఫూ అకాడమీ గ్రాండ్ మాస్టర్ రాజమల్లు అన్నారు. గురువారం పట్టణంలోని గురు నానక్ ఫంక్షన్ హాల్లో వివిధ విభాగాల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులను అయన అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో అమ్మాయిలు ఉద్యోగం లేదా వివిధ పనుల రీత్యా ఒంటరిగా వేరే ఊళ్లల్లో ఉండి పనిచేయాల్సి వస్తుందని, అందుకే అమ్మాయిలకు పోకిరీల నుండి మార్షల్ ఆర్ట్స్ మాత్రమే రక్షణగా ఉండి, కాపాడుతుందన్నారు. అనంతరం వివిధ భాగాల్లో మెడల్స్ వచ్చిన విద్యార్థులను అయన అభినందించారు. రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో కటాస్ విభాగంలో డి రాజ్ కుమార్, డి శివకుమార్, జి అనిరుద్, డి రిషిత్ వర్మ, కె మాన్ విత్, పి ఆశ్రిత్, ఎండీ అనాస్, జి మణిదీప్, ఎస్ నిఖిల్, బి అశ్విత్‌లు గోల్డ్ మెడల్స్ సాధించారు. అదే విభాగంలో డి రిత్విక్ కుమార్ వెండి పథకం సాధించాడు. కాంశ్య పథకాలు సాధించిన వారిలో డి మేఘన, బి వరుణ్, ఎ సిరిలియశ్రీ, ఎ. వినలియశ్రీలు ఉన్నారు. ఫైటింగ్ విభాగంలో డి రాజ్ కుమార్, వెండి పతకం సాధించాడు. ఎ హర్షవర్ధన్, జి అనిరుద్ కాంస్య పథకాలను సాధించారు. వెపన్స్ భాగంలో ఎ హర్షవర్ధన్ బంగారు పతకం సాధించాడు.

స్నేహపూర్వక వాతావరణంలో ఆటల పోటీలు కొనసాగాలి

- భీమారం తహసీల్దార్ సదానందం



నవతెలంగాణ-జైపూర్

మండల స్థాయిలో నిర్వహిస్తున్న సీఎం కప్ -2024 ఆటల పోటీలు స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగాలని భీమారం తహసీల్దార్ సదానందం సూచించారు. మండల ప్రత్యేక అధికారి కల్పన, ఎంపీడీఓ మదుసూధన్, ఎస్ఐ స్వేత, ఎంపీఓ సతీష్‌రెడ్డిలతో కలిసి గురువారం ఆటల పోటీలు ప్రారంభించారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ మండల స్థాయిలో నిర్వహిస్తున్న పోటీల ద్వార జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. కోకో, కబడ్డి, అథ్లెటిక్స్‌తో పాటు వాలిబాల్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 21 జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొని క్రీడా ప్రతిభ కనబర్చిన వారితో జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ఆటల పోటీల ప్రారంభోత్సవంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు చేకుర్తి సరోజన సత్యనారాయణరెడ్డితో పాటు స్థానిక వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ పాల్గొన్నారు.

సుందిళ్ల బ్యారేజ్ రోడ్డులో సీసీ కెమెరాల ఏర్పాటు

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని కిష్టాపూర్ శివారులో గోదావరి నదిపై నిర్మించిన సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. బ్యారేజ్‌తో పాటు కిష్టాపూర్ జంక్షన్ రోడ్డు వద్ద 3 సీసీ కెమెరాలు గురువారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలం నుంచి సుందిళ్ల బ్యారేజ్ మీదుగా గోదావరిఖని వైపు రాకపోకలు కొనసాగించే వాహణాలపై నిఘా కొనసాగుతుందని తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం

రాఘవేంద్ర విద్యాసంస్థల ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పొంగల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని వరద బాధితుల కాలనీలో దుప్పట్లు పంపిణీ చేశారు. మండల మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ సూచనల మేరకు రాఘవేంద్ర విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు నిరుపేదలైన వరద బాధితుల కాలనీలో నివాసముండే వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర కరిమల కళాశాల ప్రిన్సిపల్ ఏ లక్ష్మణ్ పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పలువురు అధికారులు, నాయకులు పరిచయం చేసుకున్నారు. అనంతరం పోటీలను నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సాంబశివరావు, ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ భోజన్న, ఎంపీఓ షేక్ సఫ్దర్ అలీ, ఎంఈఓ ముక్తవరం వెంకటేశ్వర స్వామి, నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం సాంబమూర్తి పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా అట్కపురం రమేశ్

నవతెలంగాణ-కాసిపేట



తెలంగాణ ఆల్ ఇండియా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని దేవాపూర్‌కు చెందిన ఆట్కపురం రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కొత్త విజయ్ భాస్కర్ జిల్లా అధ్యక్షుడిగా అట్కపురం రమేశ్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తానని, నాపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడికి, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల స్థలం పరిశీలన

నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇండ్ల మోడల్ స్థలాన్ని అధికారులు పరిశీలించారు. దీంతో పాటు ముత్యంపల్లిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ మునేందర్, ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ భోజన్న ఎంపీఓ షేక్ సఫ్దర్ అలీ, కాంగ్రెస్ నాయకులు రత్నం ప్రదీప్, మైదం రమేష్, ముత్యాల రాజమౌళి, హౌసింగ్ ఏఈ అలీ పాల్గొన్నారు.

సబ్సీడీ వరి విత్తనాలు పంపిణీకి సిద్ధం

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల రైతుల సౌకర్యార్థం యాసంగి పంటలకు సంబంధంచి వరి సన్నరకం విత్తనాలు సబ్సీడీతో పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు స్థానిక వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ తెలిపారు. జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం ద్వార 50 శాతం సబ్సీడీతో కేఎన్ఎం-1638 సర్టిఫైడ్ సన్నరకం వరి విత్తనాలు అవసరమైన రైతులకు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ రకం వరి విత్తనం 125 రోజుల వ్యవధితో పంట చేతికి అందుతుందని తెలిపిన ఆయన 15 కిలోల విత్తనం బ్యాగు రూ.303 లతో రైతులకు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల రైతులు తమకు చెందిన పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో స్థానిక రైతు వేదిక వద్ద వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

రికార్డు సృష్టించి రాష్ట్ర స్థాయికి ఎంపిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా స్థాయి గణిత పాటవ పరీక్ష (టాలెంట్ పరీక్ష)లో విశేష ప్రతిభ కనబర్చి బంగారిగూడ ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు రికార్డు సృష్టించి అన్ని బహుమతులకు గెలుపొంది. రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ తెలిపారు. గురువారం వీరిని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. 2024-25 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ఈ ప్రతిభా పరీక్షలో హార్ష్ ప్రథమస్థాయి, ద్వితీయ స్థాయి హర్షవర్ధన్, తృతీయస్థాయి రమ బహుమతులను కైవసం చేసుకొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. దీంతో ఉపాధ్యాయ సిబ్బంది, ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ రాష్ట్ర స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

ఏఎస్పీని కలిసిన ట్రస్మా నాయకులు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



నిర్మల్ ఏఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఉపేందర్ రెడ్డిని ట్రస్మా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. 4 సంవత్సరాలు నిర్మల్ డిఎస్పీగా సేవలందించిన జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. మళ్లీ జిల్లాకు ఏఎస్పీగా రావడం గర్వకారణమన్నారు.


రక్తదానం ప్రాణదానంతో సమానం



నవతెలంగాణ-కెరమెరి

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ కలాం అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలను రక్షించడానికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువకులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఇనుస్, ధనోరా ఉప సర్పంచ్ సయ్యద్ రిజ్వాన్, అనార్‌పల్లి మాజీ సర్పంచ్ రాథోడ్ శేషురావ్, సేవాలాల్ సేన మండల అధ్యక్షులు రాథోడ్ రమేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్ట్ పెందూర్ ఆనంద్ రావ్ పాల్గొన్నారు.

వాహనాల వేలం పాటకు స్పందన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మద్యం, దేశీదారు అక్రమ రవాణ తదితర కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు ఎక్సైజ్ శాఖ అధికారులు గురువారం ఆబ్కారి శాఖ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటకు స్పందన లభించింది. దరఖాస్తు చేసుకున్న బిడ్డర్లను పిలిచి వారి సమక్షంలో వేలం పాట నిర్వహించారు. మొత్తం 14 వాహనాలకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా ఇందులో 13 ద్విచక్ర వాహనాలు, ఒక ఇండికా విస్టా కారు ఉంది. కొన్నింటిని తుక్కు కింద విక్రయించగా వినియోగించేదుకు వీలుగా ఉన్న వాటిని పలువురు బిడ్డర్లు వేలం పాటలో దక్కించుకున్నారు. అక్రమ మద్యం, దేశీదారు సరఫరా చేస్తు రెండేళ్ల వ్యవధిలో పట్టుబడ్డ 13 ద్విచక్ర వాహనాలు, ఒక కారుకు వేలం పాటను ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ తెలిపారు. వీటిలో రన్నింగ్ కండీషన్లో ఉన్న వాటికి, తుక్కు కింది వెళ్లే వాటికి వేర్వేరుగా బిడ్డింగ్లను ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ విజయేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-ముధోల్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను గురువారం ఆ పార్టీ ముధోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు డా.కిరణ్ కుమార్, లోలం శ్యామ్‌సుందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముధోల్ నియోజకవర్గ పార్టీ స్థితి గతులు, సమస్యలు, అభివృద్ధిపై చర్చించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని అన్ని ఉమ్మడి జిల్లాలో కొత్తగా నవోదయ విద్యాలయాలు మంజూరు చేయగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మంజూరు కాలేదనే విషయం కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో నవోదయ విద్యాలయం విషయం ప్రస్తావించాలని కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్న ఈ విద్యాలయం మంజూరు కాలేదని వివరించారు. నిర్మల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం త్వరలోనే ఉంటుందని, కేటీఆర్ వస్తానని చెప్పినట్టు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా రాజేశ్వర్

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



నిర్మల్ పట్టణానికి చెందిన న్యాయవాది రాజేశ్వర్ రత్నం రావు ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రత్నం మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన జాతీయ అధ్యక్షుడు కృష్ణ స్వరూప్, రాష్ట్ర అధ్యక్షుడు వసంత్ రావుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ఐరన్ డోర్లను పట్టుకున్న సింగరేణి ఎస్అండ్‌పీసీ

నవతెలంగాణ-రెబ్బెన

మాదారంలోని సింగరేణి క్వార్టర్ ఐరన్ డోర్లను తొలగించి స్క్రాబ్‌కు తరలిస్తుండగా సింగరేణి ఎస్అండ్‌పీసీ సిబ్బంది గురువారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే జమేధార్ దశరతం పటేల్ ఆధ్వర్యంలో సిబ్బంది మాదారంలో తనిఖీ చేశారు. ఆటోలో ఐరన్ డోర్‌ను తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకున్నారు. దాని విలువ సుమారు రూ.10 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టుకున్న సామాగ్రి, ఆటోను గోలేటి 1 ఇంక్లైన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో తపాన్ మండెల్, గొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్



కవ్వాల్ టైగర్ జోన్ పునరావాస గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కవ్వాల్ ఫారెస్ట్ పునరావాస గ్రామాలు రాంపూర్, మైసంపేట్ ప్రజలకు కల్పిస్తున్న వసతులు, ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ ఇతర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ సంబంధించి పునరావాస గ్రామాలైన రాంపూర్, మైసంపేట్ గ్రామాలలో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజల సంక్షేమంతో పాటు కవ్వాల్ అడవులను పరిరక్షించాలని సూచించారు. రహదారులు, నివాసాలకు విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. వ్యవసాయం, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, గ్రామ పాఠశాలలో పిల్లల భవిష్యత్తుకు భరోసాగా మంచి విద్య అందించాలన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడానికి పరిశ్రమలు లేదా స్వయం ఉపాధి మార్గాలను ప్రోత్సహించాలన్నారు. ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ పక్కాగా అమలు చేయాలన్నారు. అటవీ భూమల రక్షణ, పర్యావరణం, ప్రకృతి వనరుల పునరుద్ధరణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, డీఎఫ్ఓ నాగిని భాను, జడ్పీ సీఈఓ గోవింద్, డీపీఓ శ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారులు అశోక్ కుమార్, శంకరయ్య, డీటీడీఓ అంబాజీ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ సుదర్శన్, ఖానాపూర్ ఎఫ్‌డీఓ భవాని శంకర్, అటవీ శాఖ అధికారులు అరుణ్, రాజేందర్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ అరుణ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 15, 16 తేదీలలో జిల్లాలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం ఎస్పీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-2 పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని, అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో పరీక్ష నిర్వహణకు 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, గదులలో సీసీ కెమెరాలు, ప్రతి పరీక్ష గదిలో గోడ గడియారాలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలో మొత్తం 4 పేపర్లు ఉంటాయని, 15న 2 , 16న 2 పేపర్లు ఉంటాయని, ఉదయం పేపర్ 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం పేపర్ మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటుందన్నారు. ఉదయం పరీక్షకు 9.30, మధ్యాహ్నం పరీక్షకు 2.30 గంటలకు గేట్లు మూసివేస్తారన్నారు. పరీక్ష కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, షూలకు అనుమతి ఉండదన్నారు. ఆర్టీసీ అధికారులు పరీక్ష సమయానికి అనుకూలంగా బస్సులు నడిపించాలని, పరీక్షా కేంద్రాలలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, అత్యవసర వైద్య చికిత్స కోసం వైద్య సిబ్బందిని నియమించాలని తెలిపారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షల దృష్ట్యా జిల్లాలోని 18 పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు అమలు చేస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు 5 మందికి మించి గుంపులుగా ఉండరాదని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలు, ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించకూడదని తెలిపారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ షాపులు, ఇతర దుకాణాలు మూసివించడం జరుగుతుందని, పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు చేపట్టడంతో పాటు పరీక్షలు జరిగే ప్రాంతాలలో పెట్రోలింగ్ పార్టీలను నియమించామన్నారు. అదనపు కలెక్టర్, నోడల్ అధికారి మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న గ్రూప్-2 పరీక్షలకు సంబంధించిన పేపర్లు జిల్లాకు చేరుకున్నాయని, వాటిని పటిష్ట బందోబస్తు మధ్య జిల్లా ఖజానా కార్యాలయంలో భద్రపరచడం జరిగిందని, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనరసింహ, పరీక్ష కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు, పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, రూట్ అధికారులు పాల్గొన్నారు.



రేపు కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమం లాంచింగ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 40 శాతం డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ఈ నెల 14న శనివారం జిల్లాలోని సంబంధిత విద్యసంస్థలలో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హల్ నుండి గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 14న జిల్లాలో ఉన్న అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, మోడల్స్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలలో డైట్ చార్జీలు పెంపు లాంచ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులని ఆహ్వానించాలన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారని, విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానాలు పంపాలని, విద్యాసంస్థ ఆవరణలో సానిటేషన్ చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, నాణ్యమైన ఆహార పదార్థాలతో రుచికరమైన భోజనం సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పిల్లలకు నాణ్యమైన ఆహారం అందిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధనలు అందించుటకు కృషి చేస్తుందని, అందులో భాగంగానే జిల్లాలో ప్రతి హాస్టల్‌కి ఒక అధికారిని నియమించి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రణాళిక ప్రకారం విద్యార్థుల స్థితిగతులను తెలుసుకుంటూ అందిస్తున్న సౌకర్యాలను తనిఖీ చేస్తూ పాఠశాలల బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజాలింగు, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ సునీత, సంబంధిత విద్యా సంస్థల ప్రిన్సిపల్స్, వార్డెన్లు, ఎంపీఓలు, ఎంఈఓలు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తు విలేజ్ పోలీస్ అధికారులు విధిగా గ్రామాల్లో పర్యటించాలని ఎస్పీ డీవీ.శ్రీనివాస్ సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలు, 5 ఎస్ అమలు తీరు, రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర విభాగాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై రివ్యూ చేసి, పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి పలు సూచనలు చేసి పోలీస్ స్టేషన్ల పరిధిలోని కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించే విధంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తునే గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు గంజాయి వలన కలిగే అనర్థాలు, మహిళ చట్టాలు, సైబర్ నేరాలు, తదితర వాటిపై అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు, వ్యాపారస్తులకు సీసీ కెమెరాల ఉపయోగం, నేర నియాత్రణలో సీసీ కెమెరాల ప్రముఖ్యాత గురించి అవగాహన కల్పిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ రామానుజం, సీఐ శ్రీనివాస్, ఎస్సై సందీప్, సిబ్బంది ఉన్నారు.

రక్షణలో ప్రతి ఉద్యోగి భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థలు పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని సింగరేణి రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ ఎలీసా సూచించారు. గురువారం గోలేటి సీహెచ్‌పీ ఆవరణలో 55వ రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ ఎలీసా (జీఎం స్టోర్స్) సారధ్యంలో రక్షణ తనిఖీ బృందం బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్‌తో కలిసి సీహెచ్‌పీని పరిశీలించారు. సీహెచ్‌పీలో రక్షణ చర్యలు బాగున్నాయని అభినందించారు. రవాణా సమయంలో తీసుకుంటున్న చర్యలను చూశారు. ఆటోమెటిక్ ఆపరేటింగ్ సిస్టమ్, వాయిస్ కంట్రోలింగ్ సిస్టం పనితీరును పరిశీలించారు. సీహెచ్‌పీ ప్రధాన రహదారి పక్కన ఉన్న దుమ్ము లేకుండా ఇంటి వాతావరణాన్ని తలపించేలా ఆహ్లాదకరంగా ఉందన్నారు. అనంతరం ఉద్యోగులకు పలు రక్షణ సూచనలు చేశారు. ఇంటినుంచే రక్షణాత్మకంగా పరికరాలు ధరించి విధులకు హాజరుకావాలని సూచించారు. సీహెచ్‌పీ ఉద్యోగ కళాకారుల లోటో సిస్టం ప్రదర్శన అలరించింది. గతేడాది కంపని స్థాయిలో గోలేటి సీహెచ్‌పీకి వచ్చిన బహుమతిని అందించారు. ట్రేడ్ టెస్ట్ విజేతలు, రక్షణతో కూడిన విధులు నిర్వర్తించే ఉద్యోగులు, ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కె.రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీంరావ్ జాడే, సీహెచ్‌పీ ఇన్‌చార్జి కోటయ్య పాల్గొన్నారు.

ముధోల్ ఎస్ఐ సంజీవ్ కుమార్

నవతెలంగాణ-ముధోల్



ముధోల్ ఎస్సైగా కే.సంజీవ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్సైగా పని చేసిన సాయికిరణ్ ఇటివలే బదిలీపై వేళ్లారు. దీంతో ఆయన స్థానంలో నిర్మల్ నుండి బదిలీపై ఎస్సైసంజీవ్ కుమార్ ముధోల్ ఎస్ఐగా వచ్చారు. కాగా గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

మృతదేహాన్ని గుర్తుపడితే తెలపండి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అనారోగ్య కారణాలతో గుర్తు తెలియని వ్యక్తి ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో ఈనెల 11న చనిపోయినట్టు ఆదిలాబాద్ 2 టౌన్ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు. ఆ వ్యక్తి వయస్సు సుమారుగా 50-60 సంవత్సరాలుంటుందని తెలిపారు. ఆ వ్యక్తి టీ షర్ట్, జీన్ ప్యాంట్ దరించినట్టు పేర్కొన్నారు. ఎవరికైనా తెలిస్తే గుర్తిస్తే 2 టౌన్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. మృతదేహం రిమ్స్‌లో భద్రపరిచినట్టు తెలిపారు.

సింగరేణిడే ఉత్సవాల సందర్భంగా నిరసన తెలియజేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

ఈనెల 23న సింగరేణి యాజమాన్యం సింగరేణి ఆవిర్భావ వేడుకలకు సిద్ధమవుతుందని, ఆ రోజు కార్మికులు సమస్యల పరిష్కరం కోసం నిరసనలకు సిద్ధం కావాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దూలం శ్రీనివాస్, మధు కోరారు. కాంట్రాక్టు కార్మికులను పస్తులు ఉంచి, వాళ్ల సమస్యలు పరిష్కరించకుండా వాటిపై ప్రకటన చేయకుండా సింగరేణి యాజమాన్యం ఉత్సవాలకు సిద్ధమవుతుందన్నారు. ఈ నేపద్యంలో సింగరేణి డే సందర్భంగా నిరసనలు తెలపడం బాధాకరమైన నిరసనలకు పిలుపు ఇవ్వాల్సిన పరిస్థితిని సింగరేణి యాజమాన్యమే సృష్టించిందన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం తన వివక్షతాపూరితమైన నిర్లక్ష్యాన్ని విడనాడి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి కాంట్రాక్టు కార్మిక సంఘాలతో చర్చలు జరపాలన్నారు. సింగరేణి డేలో నల్ల బ్యాడ్జీలు, నల్లజెండాలతో నిరసనలు తెలియజేయాలని కోరారు.

కాంగ్రెస్ హామీల వైఫల్యంపై అసెంబ్లీలో నిలదీయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

కాంగ్రెస్ హామీల వైఫల్యంపై అసెంబ్లీలో నిలదీయాలని ఆదిలాబాద్ జిల్లా నాయకులు గురువారం హైదరాబాదులోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి విన్నవించారు. ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్న వివరాలను కేటీఆర్‌కు వివరించామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆదిలాబాద్‌కు సంబంధించిన పెండింగ్ అంశాలు లేవనెత్తాలని కోరడం జరిగిందన్నారు. సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు అన్ని జిల్లా కేంద్రాల్లో సమ్మె చేస్తున్నారని, ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి సమస్యలను చాయ్ తాగినంత సేపట్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో అవస్థలు పడుతున్నారన్నారు. ఏడాది పాలన పూర్తయినా సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

నవతెలంగాణ-నిర్మల్ టౌన్

ఈ నెల 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల కోరారు. జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రాజీకి అర్హత కలిగిన క్రిమినల్ కేసులతో పాటు రాజీపడదగిన వివాదాలు, తదితర సమస్యలను ప్రజలు పరిష్కరించుకోవాలని సూచించారు.

రేపు బాసరకు మంత్రి సీతక్క రాక

నవతెలంగాణ-ముధోల్

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన బాసర పుణ్యక్షేత్రానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శుక్రవారం రానున్నారు. మొదట సరస్వతి అమ్మవారిని దర్శించికోనున్నట్టు కాంగ్రెస్ నాయకలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీతక్క ఇన్‌చార్జి మంత్రి హోదాలో బాసరకు రానున్నడంతో స్థానికులు, ట్రిపుల్ ఐటీ విద్యార్థులు వారు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించవచ్చనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటీకి ఇప్పటివరకు ఇన్‌చార్జి మంత్రి సందర్శించలేదు. అయితే బాసర ట్రిపుల్ ఐటీకి మంత్రి సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేయనున్నారు. ట్రిపుల్ ఐటీపై ఇప్పటి వరకు మంత్రి హోదాలో సమీక్ష నిర్వహించలేదని ప్రతిపక్ష నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి ట్రిపుల్ ఐటీకి రానుండడంతో అక్కడి సమస్యలను తెలుసుకొని, నిధుల కొరత కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తే ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న ట్రిపుల్ ఐటీకీ మేలు జరుగుతుందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. మంత్రి చొరవతో ట్రిపుల్ ఐటీ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందో లేదో వేచి చూడాలి.